ఈనాడు వరంగల్

నేడు తెప్పోత్సవం



భద్రకాళి చెరువులో సిద్ధమవుతున్న తెప్ప

రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం సాయంత్రం 7 గంటలకు భద్రకాళి తటాకం(చెరువు)లో తెప్పోత్సవం నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి చక్రస్నానం, సామ్రాజ్య పట్టాభిషేకం, సాయంత్రం శ్రీభద్రకాళి భద్రేశ్వరులకు జల క్రీడోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు ఈవో శేషభారతి తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి ఇబ్బందులు రానీయకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

అమ్మవారే స్ఫూర్తి.. ఉద్యోగార్థి విజయానికి నాంది

దసరా శరన్నవరాత్రులు దేశమంతా ఎంతో కోలాహలంగా నిర్వహిస్తారు. ఉమ్మడి వరంగల్‌లో భద్రకాళి దేవస్థానం, కాళేశ్వర క్షేత్రం, కొత్తకొండ, ఐనవోలు హనుమద్గిరి పద్మాక్షి గుడితోపాటు అనేక చోట్ల జగన్మాత ఆలయాలు కొలువై ఉన్నాయి. అమ్మలగన్న అమ్మ దుర్గమ్మ నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. ప్రభుత్వం.. వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేస్తోంది. ప్రభుత్వ కొలువు సాధించాలంటే పట్టుదల, సహనం, ఏకాగ్రత, కష్టపడే తత్వం ఉండాలి. ఆ లోకమాత నుంచి ఉద్యోగార్థులు నేర్చుకోవాల్సిన అంశాలపై కథనం.

ఈనాడు, వరంగల్, మహబూబాబాద్



తెలివిగా ఆలోచన

అమ్మవారు రాక్షసులను సంహరించేటప్పుడు ఎంతో తెలివిగా ఆలోచించింది. రక్తబీజుడనే అసురుడికి ఒక వరం ఉంటుంది. అతని రక్తం బొట్టు నేలపై పడితే రక్తబీజులు పుట్టుకొస్తూనే ఉంటారు. అందుకే కాళీ అవతారంలో అమ్మ అతన్ని చీల్చి చండాడడమే కాకుండా ఒక్క రక్తం చుక్క నేలపై పడకుండా రుధిరాన్ని పీల్చేసి సంహరిస్తుంది.

● పోటీ పరీక్షల్లోనూ తెలివైన వ్యూహం ఎంతో అవసరం. లెక్కలు వేగంగా చేయడానికి కిటుకులు అవసరం. వాటిని ఉపయోగించి తెలివిగా పరీక్ష రాయడం చాలా ముఖ్యం.

తల్లిని ఆరాధిస్తే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది..



- తాటికొండాల వినయ్ శర్మ, జ్యోతిష ఆగమ పండితుడు, కొత్తకొండ దేవాలయం, హనుమకొండ

అమ్మవారిని ఎవరైతే ఆశ్రయిస్తారో వారికి అన్నీ లభిస్తాయి. శరన్నవరాత్రుల్లో ఆరాధించిన వారికి అనుకున్న కార్యాలు పూర్తవుతాయి. దేవీభాగవతంలో ఆ తల్లి గురించి గొప్ప వర్ణన ఉంటుంది. ఆమె సుగుణాల పుట్ట. మొదటి రోజు బాల త్రిపుర సుందరిగా.. 9వ రోజు మహిషాసురమర్దినిగా అవతరించి రాక్షసులను సంహరించి లోకానికి రక్షణనిస్తుంది. దేవీ సప్తశతిలోనూ ఒక్కో అధ్యాయంలో ఒక్కో రాక్షసుడిని సంహరించినట్టు శ్లోకాల్లో వర్ణన కనిపిస్తుంది.

కొత్త అవతారం

అమ్మవారి నుంచి ఉద్యోగార్థులు నేర్చుకోవాల్సిన మొదటి లక్షణం మార్పు. ఆ జగన్మాత లోకాలను రక్షించేందుకు అనేక మంది రాక్షసులను సంహరించింది. ఈ క్రమంలో రోజుకో అవతారంలోకి మారింది.

● **ఏం నేర్చుకుందాం:** విద్యార్థులు ఉద్యోగాలు పొందాలంటే మొదట మారాలి. ఇన్ని రోజులు ఏవేవో చిన్న ఉద్యోగాలో మరో పనో చేస్తూ ఉండొచ్చు. ఇప్పుడు కొత్త జీవనశైలి అలవర్చుకోవాలి. రోజూ ఏకాగ్రతతో చదువుతూ విద్యార్థి అవతారం ఎత్తాలి. అందులో లీనం కావాలి.

పట్టుదల

అమ్మవారు ఒక్కో రాక్షసుడిని సంహరించేందుకు ఎంతో పట్టుదల చూపింది. సహనంతో ముందుకు సాగి లోకాన్ని కాపాడింది.

● ఉద్యోగార్థులు పట్టువదలని విక్రమార్కుడి అవతారం ఎత్తాలి. ఒక్క రోజు చదివి మర్నాడు మానేస్తే ఫలితం శూన్యం. ప్రతి రోజూ కార్యదీక్షతో చదవాలి. కొలువు దక్కే వరకు సహనాన్ని కోల్పోవద్దు.

శత్రువులను జయిద్దాం

అప్పట్లో రాక్షసులే లోకానికి శత్రువులు. ఇప్పుడు రాక్షసులు మనలోనే ఉన్నారు. అవే బద్ధకం, భయం, చరవాణితో కాలక్షేపం చేయడం, అనాసక్తి..

● ఆ తల్లిని స్ఫూర్తిగా తీసుకొని వాటిని జయించాలి. ఉద్యోగార్థులు బద్ధకం వీడి ఉదయం 4 గంటలకే నిద్ర లేచి కాసేపు వ్యాయామం చేసి చదవాలి. హనుమకొండలోని కేంద్ర గ్రంథాలయంలో ఉద్యోగార్థులు ఉదయం 4 గంటల నుంచే చదవడం ప్రారంభిస్తారు. చరవాణిని కాలక్షేపం కోసం చూడొద్దు. నిరాశ అనేది మరో శత్రువు, సానుకూల దృక్పథంతో చదవడం అలవర్చుకోవాలి.

బహుముఖ ప్రజ్ఞ

మహిషాసుర మర్దిని అనేక చేతులతో యుద్ధం చేస్తుంది. ఒకేసారి అనేక పనులు చక్కదిద్దే సత్తా ఆ తల్లిది.

● ఉద్యోగార్థులు బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఉండాలి. దినపత్రికలు చదివి పరీక్షలకు అవసరమయ్యే విషయాలను గ్రహించాలి. ముందే చదివిన విషయాలను పునశ్చరణ చేసుకోవాలి.

దసరా సంబరాల వేళ 64 వసంతంలోకి అడుగిడుతున్న ఇండియన్ ఏజెన్సీస్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్సిరెడ్డి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజక వర్గ యూటీఎఫ్ అభ్యర్థిగా అలుగుబెల్లి నర్సిరెడ్డి మరోసారి పోటీ చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ప్రకటించారు. ఎమ్మెల్సీగా ఐదున్నర సంవత్సరాలు ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న నర్సిరెడ్డి చట్టసభల్లో ఉండాల్సిన అవసరముందని, అందుకే మరోసారి అభ్యర్థిగా నిలబెడుతున్నామని చెప్పారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే నల్గొండ నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టినట్లు గుర్తు చేశారు. అభ్యర్థి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.శ్రీనివాస్, కె.సురేష్, తెలంగాణ విశ్వవిద్యాలయాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్‌కుమార్ లోథ్, ప్రిన్సిపాళ్ల సంఘం ప్రతినిధి శ్రీనివాస్, ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండయ్య, మహేశ్, వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉర్సు రంగలీలా మైదానంలో దసరా ఉత్సవాలు

కరీమాబాద్, న్యూస్‌టుడే: కరీమాబాద్ ఉర్సు గుట్ట రంగలీలా మైదానంలో జరిగే దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. వరంగల్ మహా నగర పాలక సంస్థ, కూడా, ఆర్ అండ్ బీ, ఎన్పీడీసీఎల్, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు శాఖలు రావణ వధ ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేశాయి. శనివారం సాయంత్రం 6 నుంచి ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు రావణవధ పూర్తి వరకు కొనసాగుతాయి. మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు పూర్తిచేశామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు తెలిపారు.



సిద్ధమైన రావణాసురుడి బొమ్మ

బ్యాడ్మింటన్‌లో చేతన్ శౌర్యకు పతకం



వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన క్రీడాకారుడు శ్రీ చేతన్‌శౌర్య రజత పతకం సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో ఈనెల 3 నుంచి 11వ తేదీ వరకు ఆల్ ఇండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ పోటీలు జరిగాయి. శ్రీచేతన్‌శౌర్య అండర్-15 డబుల్స్ విభాగంలో ఈ పతకం సాధించాడు. నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో కోచ్ శ్రీధర్ వద్ద ఆయన తర్ఫీదు పొందుతున్నాడు. షట్లర్‌ను వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు డా.రమేష్‌కుమార్, కార్యదర్శి పింగిళి రమేష్‌రెడ్డి అభినందించారు.

భద్రకాళి ఆలయానికి భక్తుల వెల్లువ



సామూహిక కుంకుమార్చనలో..



రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజు భద్రకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మవారు మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం మహిషాసుర మర్దినిగా అవతరించారు. అసుర శక్తులపై పిడుగుల వర్షం గుప్పించి విజయాలను అందించారు. శుక్రవారం ఉదయం నుంచి వివిధ పూజారాధనలు జరిపారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు చతురస్త సేవ, సాయంత్రం సర్వభూపాల వాహన సేవలు జరిపారు. మధ్యాహ్నం మహా పూర్ణాహుతి జరిగింది. ఐఏఎస్ అధికారి అమేయ్‌కుమార్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

కిలో రూ.30కే కొత్తిమీర, పుదీనా



నిన్నమొన్నటి వరకు కిలో రూ.100 నుంచి రూ.150 వరకు పలికిన కొత్తిమీర ధర కిలో రూ.30కు పడిపోయింది. బెంగళూరులో కేవలం కిలో రూ.5కే లభిస్తుండగా, రవాణా, పన్నులు, ఇతర ఖర్చులు కలుపుకొని వరంగల్ లక్ష్మీపరం మార్కెట్‌లో కిలో రూ.30కి విక్రయిస్తున్నారు. కిలో పుదీనా కూడా ఇంచుమించు ఇదే ధరలో లభిస్తోంది. కర్ణాటక రాష్ట్రం సోలగిరిలో అనుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా.. ఈసారి కొత్తిమీర, పుదీనా పంటలు అంచనాకు మించి దిగుబడి వచ్చాయంటున్నారు. ఫలితంగా మార్కెట్‌లో ధరలు పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

10 లక్షల జనాభా దాటిన నగరాల్లో వరంగల్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: దేశంలో పది లక్షల జనాభా దాటిన 71 నగరాల్లో చారిత్రక ఓరుగల్లు నగరం చేరింది. 2024 నాటికి దేశవ్యాప్తంగా 72 నగరాలు మిలియన్ ప్లస్ జనాభాతో ఉంటాయని అంచనా వేశారు. రాష్ట్రం నుంచి గ్రేటర్ వరంగల్, ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు మిలియన్ ప్లస్ జనాభా ఉన్న సిటీల జాబితాలో చేరాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం వరంగల్ నగర జనాభా 7.43 లక్షలు కాగా, తాజాగా వేసిన తాత్కాలిక లెక్కల ప్రకారం 8.19 లక్షలు ఉంది. వాస్తవంగా 11 లక్షల పైచిలుకు ఉంటుందని రాష్ట్ర పురపాలక శాఖ అంచనాలు చెబుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మిలియన్ ప్లస్ నగరాలు 52 ఉండగా, తాజా గణంకాల ప్రకారం 71కి చేరాయి.

నిర్లక్ష్యపు నీడలో మినీ స్టేడియం



నర్సంపేటలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో చెత్తా చెదారం ఉండడంతో అపరిశుభ్రంగా మారింది. పిచ్చి మొక్కలు పెరగడంతో విష కీటకాలు సంచరిస్తున్నాయి. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో నడకకు వెళ్లే వారు, క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో రాత్రివేళ అంధకారం నెలకొంటోంది. స్టేడియంలో ఉన్న వ్యాయామ పరికరాలు పని చేయడం లేదు. పుర అధికారులు స్పందించి క్రీడా మైదానాన్ని శుభ్రం చేయించాలని, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నర్సంపేట



మేఘాలను చుట్టేసిన ఇంద్రధనస్సు

ఆకాశంలో మేఘమాలను ఇంద్రధనస్సు చుట్టేసి చూపరులకు కనువిందు చేసింది. శుక్రవారం సాయంత్రం వర్షం కురిసే ముందు వర్ధన్నపేట మండలం నర్రెంగ తండా గ్రామ శివారులో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. – న్యూస్‌టుడే, పర్వతగిరి

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కీర్తినగర్‌కాలనీ(గీసుకొండ) : గీసుకొండ మండలం మొగిలిచెర్లకు చెందిన ఉపాధిహామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంటుగా పని చేస్తున్న కూనమళ్ల ఓంకార్ (46) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఆయన కుటుంబానికి అదనపు డీఆర్‌డీవో రేణుకాదేవి రూ.20 వేలు, ఎంపీడీవో కార్యాలయం నుంచి రూ.18 వేలు అందజేశారు. ఈజీఎస్ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.మోహన్‌రావు, ఎంపీడీవో కృష్ణవేణి, సెర్ప్ ఏపీఎం సురేష్, ఈజీఎస్ ఏపీవో చంద్రకాంత్ తదితరులు ఓంకార్ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

ఘనంగా ప్రపంచ గుడ్డు దినోత్సవం

మామునూరు,న్యూస్‌టుడే: మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. గుడ్డు ప్రాముఖ్యతను వివరించారు. పశు వైద్య శాస్త్రవేత్తలు శశాంక్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



హుస్సేన్(ఫైల్)

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలా వరంగల్‌లో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. పడమరకోటకు చెందిన ఎండీ.హుస్సేన్(32) వృత్తి రీత్యా గృహ నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం స్నేహితుడితో కలిసి మద్యం తాగేందుకు వెళ్లాడు. ఆ తరువాత స్నేహితుడి ఇంటి వద్దే ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ఇది గమనించిన స్నేహితుడు శివ అదే రాత్రి స్థానికంగా ఉన్న ఇంటికి తీసుకుపోయి కుటుంబ సభ్యులకు హుస్సేన్‌ను అప్పగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే హుస్సేన్ మృతి చెందాడు. తన భర్తను స్నేహితుడు శివ హత్య చేశాడని అనుమానం వ్యక్తం చేస్తూ భార్య సంధ్యారాణి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

మట్టెవాడ, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన ఇంతేజార్‌గంజ్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎంఏ.షుకూర్ కథనం మేరకు.. ఈ నెల 8న గిర్మాజీపేటకు చెందిన ఎండీ.జిలాని(60) ప్రమాదవశాత్తు ఇంట్లో కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు అదేరోజు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతు శుక్రవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు యాకూబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలో శుక్రవారం ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రవికుమార్ తెలిపిన ప్రకారం.. గీసుగొండ మండలం గొర్రెకుంటకు చెందిన ఎడ్ల ప్రశాంత్, శ్రీలత దంపతులు మూడేళ్ల క్రితం నర్సంపేటకు వచ్చి మాదన్నపేట రోడ్డులో నివాసం ఉంటున్నారు. ప్రశాంత్ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. బతుకమ్మ పండగ కోసం శ్రీలత ములుగు జిల్లా తాడ్వాయికి వెళ్లింది. ప్రశాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, 19 నెలల కుమార్తె ఉన్నారు. తన భర్త మృతిపై అనుమానం ఉందంటూ శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఐదు రోజులుగా నీటి సరఫరా బంద్

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: వరంగల్ లేబర్‌కాలనీ టీఆర్‌టీ కాలనీలో ఐదు రోజులుగా మంచి నీటి సరఫరా లేకపోవడంతో పండగ వేళ స్థానికులు పరేషాన్ అవుతున్నారు. సోమవారం నీటి సరఫరా జరగ్గా మళ్లీ బుధవారం, శుక్రవారం రోజు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేయాల్సి ఉంది. స్థానిక వాటర్ ట్యాంకులో ఏర్పడిన సాంకేతిక కారణాల వల్ల నీటి సరఫరా చేయలేక పోయామని అధికారులు చేతులెత్తేశారు. బతుకమ్మ, దసరా పండగ సమయంలో జనం తీవ్ర స్థాయిలో సమస్యలు ఎదుర్కొన్నారు. ఈ అంశాన్ని పురపాలక సంఘ డీఈ రంగారావు దృష్టికి తీసుకుపోగా సాంకేతిక సమస్య పరిష్కరించి నీటి సరఫరా సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరిస్తా



డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఫార్మసిస్టులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఫార్మసిస్టుల సమస్యలు పరిష్కరిస్తానని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన వరంగల్ డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ప్రభుత్వ ఫార్మసిస్టుల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో డీహెచ్‌ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. హనుమకొండ జిల్లా కార్యదర్శి సతీష్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్‌సాగర్, అవినాష్ తదితరులున్నారు.

కాశీబుగ్గలో రావణ వధ ఏర్పాట్లు పూర్తి

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వరంగల్ కాశీబుగ్గ చిన్నవడ్డెపల్లి చెరువు ప్రాంగణంలో శనివారం నిర్వహించనున్న రావణ వధ కార్యక్రమం ఏర్పాట్లను ఉత్సవ కమిటీ పూర్తిచేసింది. ముఖ్య అతిథులు కూర్చునేందుకు వేదికను సిద్ధం చేశారు. శనివారం రావణ ప్రతిమను తెచ్చి ఇక్కడ బాణాసంచా అమర్చనున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు తదితర ప్రముఖులు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దూపం సంపత్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గుల్లపెల్లి రాజ్‌కుమార్ తెలిపారు.

ఎల్బీ కళాశాల మైదానంలో పార్కింగ్

మట్టెవాడ, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవాలయానికి వచ్చే భక్తులు సమీపంలోని ఎల్బీ కళాశాల మైదానంలో వాహనాలు పార్కింగ్ చేయాలని మట్టెవాడ సీఐ తుమ్మ గోపీరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, భద్రకాళి ప్రధాన ఆర్చి నుంచి వచ్చి కాపువాడ రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించారు. ఎల్బీ కళాశాలతోపాటు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిలుపుకోవాలని సూచించారు.

కళాకారులకు డప్పుల పంపిణీ

గీసుకొండ, న్యూస్‌టుడే: ఊకల్‌హవేలీలోని డప్పు కళాకారులకు ఇదే గ్రామానికి చెందిన నేతాజీ సర్వీసు టీమ్ అధ్యక్షుడు మొగసాని శంకర్ డప్పులను పంపిణీ చేశారు. తన తండ్రి సాంబయ్య, అన్నయ్య రాజు జ్ఞాపకార్థం వీటిని పంపిణీ చేశారు.

బతుకమ్మ విగ్రహం ధ్వంసం



విగ్రహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

దుగ్గొండి, న్యూస్‌టుడే: మైసంపల్లిలోని బతుకమ్మ విగ్రహాన్ని శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శాసనసభ ఎన్నికల ముందు భారాస కార్యకర్తలు ఈ విగ్రహాన్ని తయారు చేయించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆవిష్కరించలేదు ఈ విగ్రహం వద్ద గురువారం రాత్రి మహిళలు బతుకమ్మ ఆడారు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం భారాస గ్రామశాఖ అధక్షుడు గుండెకారి రాజేశ్వర్‌రావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. బతుకమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మైసంపల్లిలోని బతుకమ్మ విగ్రహాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. జడ్పీ మాజీ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మొగిలి, భారాస మండల ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయకులు సురేందర్‌రెడ్డి, నగేశ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

గీత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట



కార్మికులకు రక్షణ కవచాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట, న్యూస్‌టుడే: గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన 199 మంది గీత కార్మికులకు ఎమ్మెల్యే కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేశారు. ప్రమాదాల్లో గాయపడిన గీత కార్మికులకు రూ.25 వేల సాయం అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి పుష్పలత, ఎక్సైజ్ డీఎస్పీ మురళీధర్ సీఐ నరేశ్‌రెడ్డి, మార్కెట్ ఛైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సాంబయ్య, కౌన్సిలర్లు రాజేందర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణాలు కాపాడిన అధికారికి సన్మానం



నాగరాజును సత్కరించిన రాజశేఖర్, సుదర్శన్ తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా గురువారం రాత్రి నర్సంపేటలోని పెద్దకాలువలో కొట్టుకుపోతున్న బాలుడిని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కాపాడిన విషయం తెలిసిందే. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శుక్రవారం స్థానిక పురపాలక కార్యాలయంలో నాగరాజును శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఆర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రాజశేఖర్, వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, స్వచ్ఛంద సంస్థల సభ్యులు దేవేందర్, నాగరాజు, మెడికల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రవికాంత్, పుర ఉద్యోగులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కప్ అందుకుంటున్న రన్నర్ టీం సభ్యులు

నర్సంపేటగ్రామీణం, న్యూస్‌టుడే: నర్సంపేట మండలం ముగ్ధుంపురంలోని జయముఖి ఇంజినీరింగ్ కళాశాలలో మిషన్ ముగ్ధుంపురం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో స్పైస్ రాకర్స్ జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం విజేతలకు బహుమతులు అందజేశారు. స్పైస్ రాకర్స్ జట్టుకు నిర్వాహకుడు కార్తిక్ రూ.5016 నగదు, కప్ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచి ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ జట్టు సభ్యులకు రూ.2016 నగదు, బ్యాట్, జ్ఞాపిక అందించారు.

ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన మేరుగు హరి, కోన్‌రెడ్డి సమత, బొమ్మెర సతీష్, పల్లకొండ శిల్ప, కుక్కల శ్రుతి, పులిచేరు మహేష్, సంగెం కార్తిక్, బోదే దివ్యలు ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వారిని, వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయదారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, తెలంగాణ నేత్ర అవయవ దాతల సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక జాగృతి విద్యానికేతన్‌లో.. ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికైన చెన్నారావుపేటకు చెందిన హంస రామకృష్ణను బాల్య మిత్రులు సన్మానించారు. జాగృతి విద్యానికేతన్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, మిత్రులు రఫీ, కృష్ణమోహన్, రవికుమార్, బాలకృష్ణ, సంతోష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పండగ వేళ.. స్టైల్ దండిగా!



కుర్రకారంటే.. సొగసరులు, సోగ్గాళ్లు... వాళ్ల స్టైల్‌కి మరిన్ని మెరుపులద్దే సందర్భాలు వచ్చేశాయి! కాకపోతే ఈసారి సంప్రదాయంతో చెలరేగిపోవాలి. ఇప్పుడు చెప్పబోతున్నది దసరా, దీపావళి గురించి అని మీకీపాటికే అర్థమై ఉంటుందిగా! చక్కనమ్మలూ, చక్కనయ్యలూ.. అయితే పదండి.. ఈ పండగల వేళ ఎలా మెరిసిపోవాలో తెలుసుకుందాం..

పండగని శ్రద్ధగా జరిపించేది పెద్దలైతే.. సందడి మాత్రం యూత్‌దే. ఆధునికతకు అంబాసిడర్‌లు అయిన జనరేషన్ జడ్ ఆ వేళ మాత్రం బుద్ధిమంతుల్లా సంప్రదాయ దుస్తుల్లో ఒదిగిపోతారు. అమ్మాయిలు పట్టు పావడాలు, చీరకట్టులో ముస్తాబైతే.. అబ్బాయిలు పంచెకట్టుకి జై కొడుతుంటారు. మరి ఈసారి దసరా, దీపావళికి డబుల్ ధమాకాలా వెలిగిపోవాలంటే ఈ సొగసు సూత్రాలు పాటించాల్సిందే.

అమ్మాయిలు సంప్రదాయంగా..

టీనేజీ, కాలేజీ అమ్మాయిల నుంచి ప్రౌఢల వరకు పండగ వేళ ఆ కళ ఉట్టి పడటానికి పట్టుచీరలకే ఓటేస్తుంటారు. ఆ పట్టులో వాళ్లు కోరినన్ని రకాలు ఉండనే ఉంటాయి. ఎరుపు, ఆకుపచ్చ, పసుపు.. ఇలాంటి వర్ణాల చీరలకు జతగా క్లాసిక్ రవికెలు ధరించి, వాటికి తగ్గట్టుగా ఆభరణాలు వేసుకుంటే మహాలక్ష్మిలా మెరిసిపోవడం ఖాయం. సౌకర్యంగా ఉండాలి.. స్టైల్‌గా కనిపించాలి.. సంప్రదాయం అనిపించుకోవాలి అని భావించే చక్కనమ్మలు అనార్కలీ సూట్‌కి ఓటేయొచ్చు. వీటికి కాస్త ఎంబ్రాయిడరీ తళుకులు అద్దితే పండగవేళ అందరి చూపూ మీపైనే పడుతుంది. అందులోనూ ఎరుపు, ఆరెంజ్, రాయల్ బ్లూ రంగులైతే మరింత హుందాగా ఉంటాయి. అన్నట్టు ఈ స్టైల్‌కి జుంకాలు పెట్టుకుంటే కాంబినేషన్ అదిరిపోతుంది. సంప్రదాయం, సౌకర్యం రెండూ ఉండాలి అని భావించే భామలు కుర్తాలు ఎంచుకోవచ్చు.

ఈ సమయంలో క్రిస్ప్, ఫ్లేర్డ్, గౌనులా పొడవాటివి ధరిస్తే అందంగా, హుందాగా ఉంటాయి. వీటికి జతగా పలాజో ప్యాంట్లు, రంగురంగుల దుపట్టాలు వేశారంటే పండగని ఒంటికి చుట్టుకున్నట్టే ఉంటుంది. సందడితో పండగకి వన్నె తెచ్చే పడుచు ప్రాయులకు లెహెంగా, చోళీ మంచి ఎంపిక. అచ్చ తెలుగు అమ్మాయిలకైతే లంగా, ఓణీలు ఫేవరిట్. అందులోనూ ఎంబ్రాయిడరీ చేసినవైతే సంప్రదాయ సింగారంలా ఉంటాయి. మరింత రిచ్‌గా కనిపించాలనుకుంటే గాగ్రా చోళీలు ఎంచుకోవచ్చు. ఈ స్టైల్ దుస్తులతోపాటు ముత్యాల హారాలు, వరుసల నెక్లెస్‌లు, స్టేట్‌మెంట్ చెవిరింగులు, పెద్ద పరిమాణంలో ఉండే కఫ్‌లు, దండ కడియాలు ధరిస్తే సొగసులకు నిండుదనం వస్తుంది.

అబ్బాయిల రాజసం..

అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకు ఫెస్టివల్ వార్డ్‌రోబ్‌ని రకరకాల స్టైల్స్‌తో నింపేయడానికి అవకాశం తక్కువే. అయినా ఉన్నవాటితో ప్రయోగాలు చేస్తూ ఎంచక్కా 'దసరా వచ్చిందయ్యా.. సరదా తెచ్చిందయ్యా..' అంటూ పాడుకోవచ్చు. పండగ అనగానే ప్రతి కుర్రాడికీ గుర్తొచ్చేది కుర్తా పైజమాలే. వీటిపై నెహ్రూ కోట్ ధరించారంటే దీపావళి మతాబులా వెలిగిపోవచ్చు. పైగా ఇవి సంప్రదాయానికి ప్రతీక. ధోతీ ప్యాంట్లు సైతం పండగలు, శుభకార్యాల్లో మగానుభావుల ఎంపికలో ముందుంటున్నాయి. టీనేజీ కుర్రాళ్ల నుంచి మధ్య వయస్కులదాకా ఎవరైనా వీటితో ముస్తాబు కావచ్చు. సాధారణంగా పెళ్లిళ్లలో ఎక్కువగా ధరించే షేర్వాణీలను ఈ దసరా, దీపావళికి కూడా వేసుకుంటే రాజసం ఉట్టిపడుతుంది. ఇందులోనూ ఎంబ్రాయిడరీ చేసినవైతే మరింత రిచ్‌గా కనిపిస్తాయి. వీటికి జతగా లేత రంగు బాటమ్‌వేర్ ధరించారంటే ఆకర్షణ రెట్టింపవుతుంది. ఫ్యాబ్రిక్ విషయానికొస్తే అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా.. ఎవరైనా సిల్క్, కాటన్, చిఫాన్, జార్జెట్‌ని ట్రై చేయొచ్చు. కొట్టొచ్చినట్టు కనిపించాలంటే మాత్రం ముదురు వర్ణాలను ఎంచుకొమ్మని ఫ్యాషన్ గురూలు చెబుతున్నారు.



ప్రయోగాలకు బోలెడు అవకాశాలు

దసరా, దీపావళి పండగలంటే మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు. ఈ సమయంలోనూ స్టైల్‌తో ఎన్నో ప్రయోగాలు చేయొచ్చు. సిల్క్, ఖాదీ, కలంకారీ, చేనేత కాటన్ ఫ్యాబ్రిక్ అనువుగా ఉంటాయి. వీటితో సౌకర్యం, హుందాతనం రెండూనూ. రెడ్, పికాక్ బ్లూ/గ్రీన్, రాయల్ బ్లూ రంగులు సొగసుల్ని ద్విగుణీకృతం చేస్తాయి. అమ్మాయిలకు పట్టు చీరలు, కుర్తీలు ఎవర్‌గ్రీన్ స్టైల్. ధోతీ లుక్, లాంగ్ కుర్తాలు లేదా కుర్తాలకు జతగా మోజరీలను అబ్బాయిలు వేసుకోవచ్చు. మెటల్ లేదా లెదర్ స్ట్రాప్ వాచీలు ధరిస్తే హుందాగా కనిపిస్తారు.

– షణ్మిత, ఫ్యాషన్ డిజైనర్

---

youthpage@eenadu.in

ఈతరం

థియేటర్‌లో.. హీరోల్లా..!



హీరో తెరపై విలన్‌తో ఫైటింగ్ చేస్తుంటే.. మనమే అతడ్ని చితక్కొడుతున్నట్టు సీట్లో ఎగిరెగిరి పడతాం. హీరోయిన్‌తో డ్యూయెట్ పాడుతుంటే.. ఆ స్థానంలో మనల్ని ఊహించుకొని మెలికలు తిరిగిపోతుంటాం. ఈలలు, చప్పట్లు.. అబ్బో మనం ప్రేక్షకుడు అన్న సంగతి మర్చిపోయి థియేటర్‌లోనే నవరసాలూ పండిస్తాం. సినిమాలో హీరో తన పాత్రలో లీనం అవుతాడో, లేదో తెలియదుగానీ ప్రేక్షకుడిగా అన్నీ రక్తి కట్టిస్తాం. అంతవరకు ఓకే! అది శ్రుతి మించితేనే వస్తుంది చిక్కంతా. అలా జరిగినప్పుడు 'మేం సినిమా చూడాలా.. మీ చిందుల్ని వీక్షించాలా?' అని చిరాకు పడుతుంటారు మిగతా ప్రేక్షకులు. అందుకే మన భావావేశం ఇతరుల ఆక్రోశానికి గురి కాకుండా ఉండాలంటే 'థియేటర్ ఎటికెట్' పాటించాలి. అంటే 'రేసుగుర్రం' సినిమాలో శ్రుతీ హాసన్‌లా భావోద్వేగాలను మనసులోనే అణచుకొమ్మని కాదుగానీ.. చుట్టూ వందలమంది ఉన్నారని గుర్తుంచుకొని, వాళ్ల ఫీలింగ్స్‌ని అర్థం చేసుకొని ప్రవర్తిస్తే చాలు. హాలులో లైట్లు ఆర్పేసినా, టైటిల్స్ మొదలైనా.. కొందరు పక్కవాళ్లతో ముచ్చట్లు ఆపరు. ఇంకొందరైతే శుభం కార్డు పడ్డా.. ఆ కబుర్లకు ఎండ్ కార్డు వేయరు. ఆ మాత్రం దానికి థియేటర్‌దాకా వెళ్లడం ఎందుకు? జోరీగలా పక్కవాళ్లకు ఇబ్బంది కలిగించడం ఎందుకు?

ఇంతేనా.. ముందు సీట్లపై కాళ్లు పెట్టడం, సెల్‌ఫోన్లో పెద్దగా మాట్లాడటం, పదేపదే లేచి అటూఇటూ తిరగడం.. వీటినే హీరోయిజంగా భావిస్తుంటారు కొందరు. తిన్నా, మాట్లాడినా అతి శబ్దమే ఇంకొందరు. 'పక్కవాళ్లకి ఇబ్బంది కలుగుతుందనే కామన్‌సెన్స్ కూడా ఉండదు' అని ఎంతమంది అనుకుంటారో! 'ఈ చేష్టలు కేవలం సినిమా చూడటమే కాదు. సమాజం పట్ల మనకున్న దృక్పథాన్ని తెలియజేస్తుంది' అంటారు మానసిక నిపుణులు. ఇతరుల ఫీలింగ్స్‌ని అర్థం చేసుకోలేకపోవడం, భావోద్వేగాలపై నియంత్రణ లేకపోవడం ఈ తరహా ప్రవర్తనకు కారణం అవుతుందంటారు. సమయానికి థియేటర్‌కి చేరుకోవడం, సెల్‌ఫోన్ మ్యూట్‌లో పెట్టుకోవడం, సినిమా ఆడుతున్న సమయంలో మాట్లాడకపోడం, చాటింగ్ చేయకపోవడం, ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రవర్తించడం.. ఇవి పాటిస్తే మీకే కాదు.. పక్కవాళ్లకీ సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది.

'సాఫ్ట్'గా పక్కన పెట్టేస్తున్నారు..



సందర్భం

ఓ చేతిలో కూల్‌డ్రింక్, మరో చేతిలో పిజ్జా లేదా బర్గర్, ఆపై ఆధునిక వస్త్రధారణ.. ఇవీ జనరేషన్ జడ్, మిలీనియల్స్ ఆనవాళ్లు. కానీ జంక్‌ఫుడ్, శీతలపానీయాల వాడకాన్ని గణనీయంగా తగ్గిస్తోంది ఇప్పటి యూత్. ఇది 'మింటెల్' అనే సంస్థ చేసిన అధ్యయనంలో తేలిన వాస్తవం. ఈతరం కుర్రకారులో 34 శాతం మంది మెరుగైన జీవనశైలి కోసం సాఫ్ట్‌డ్రింక్స్‌ని పక్కన పెట్టేస్తున్నారట. దాంతో వాటి అమ్మకాలు భారీగా తగ్గిపోతున్నాయి. చేసేదేం లేక ఆఫ్ సీజన్‌లో శీతల పానీయాల సంస్థలు ఎన్నో రాయితీలు ప్రకటిస్తున్నాయి. ఈ కాలం, ఆ కాలం అని తేడా లేకుండా అన్నికాలాల్లో దుమ్ము రేపే అమ్మకాలు కేవలం వేసవిలోనే ఫర్వాలేదన్నట్టుగా ఉంటున్నాయి. 'యువతలో ఎందుకీ మార్పు?' అంటే వాళ్లకి ఆరోగ్య స్పృహ పెరగడమే కారణం. యాడెడ్ షుగర్స్ పదార్థాలు, కూల్‌డ్రింక్స్ వాడకంతో ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, ఇన్సులిన్ రెసిస్టెన్స్, గుండెజబ్బుల అవకాశం ఎక్కువ కావడంతో వాటిని పక్కన పెడుతున్నామని ఈ సర్వేలో యువత స్పష్టం చేశారు. ఆరోగ్య చిట్కాలు, మెరుగైన జీవనశైలి సూత్రాలు చెప్పే ఇన్‌ఫ్లుయెన్సర్లు సైతం కొంతమేర ప్రభావం చూపిస్తున్నారు. దీనికితోడు సాఫ్ట్‌డ్రింక్స్‌కి ప్రత్యామ్నాయాలుగా కొన్ని రెస్టరంట్లు అల్లం ద్రావణం, టానిక్ వాటర్‌లాంటివి అందుబాటులో ఉంచుతున్నాయి. వెరసి, సాఫ్ట్‌డ్రింక్స్‌కి కుర్రజనం సాఫ్ట్‌గా దూరమవుతోంది.

ఈఫిల్ టవరే.. భాగస్వామి!



'మనుషులు అర్థం చేసుకోవడానికి మాది మామూలు ప్రేమ కాదు.. అగ్నిలాగ స్వచ్ఛమైనది...' అంటున్నారు కొందరు. అలాగని ఆ ప్రేమను గుండెల్లోనే దాచుకోలేదు. ఇష్టప్రకారం పెళ్లాడి ఒక్కటయ్యారు. ఇంతకీ వాళ్లు ఎవర్ని ప్రేమించారు? ఎలా పెళ్లాడారో తెలుసుకుంటే అవాక్కవ్వడం ఖాయం.

- ఎరికా లాబ్రీ అనే అమ్మడు పారిస్‌లోని ఈఫిల్ టవర్‌ని పెళ్లాడింది. పెళ్లికూతురిలా ముస్తాబై వచ్చి, తన దుపట్టాని టవర్‌లోని ఒక ఇనుప దిమ్మెకు చుట్టి సంప్రదాయబద్ధంగా పెళ్లాడింది. ఆ తర్వాత గాఢంగా ఓ ముద్దు కూడా పెట్టేసింది.
- అరోన్ చెర్వెనాక్ తన ఐఫోన్ వెనక వైపు ఒక బంగారు ఉంగరాన్ని అతికించి, దాన్ని తన వేలికి తొడుక్కొని పెళ్లి అయ్యిందనిపించాడు.
- మీర్వెన్ రోచా మోరాస్ అనే సుందరాంగి ఒక అందగాడి బొమ్మని వివాహం చేసుకుంది. 'ప్రాణం లేని బొమ్మకి మనుషుల్లా మోసం చేయడం తెలియదు. అందుకే దాన్ని నా భాగస్వామిగా చేసుకుంటున్నా' అంది. ఆ బొమ్మకి తన గుండెల్లోనే కాదు.. పడకగదిలోనూ స్థానం ఇచ్చింది రోచా.
- ఒక చెట్టుని పెళ్లికూతురిలా ముస్తాబు చేసి, బ్యాండు మేళంతో వేడుక చేస్తూ మరీ పెళ్లాడాడు రిచర్డ్ టోరెస్. చెట్టు కన్నా నిస్వార్థంగా తనకేదీ కనిపించలేదని అలా చేశాడట.

మట్టి వాసన.. మళ్లీ చూద్దామా?



ఎప్పుడెప్పుడు వీకెండ్ వస్తుందా.. ఎప్పుడెప్పుడు సెలవులు దొరుకుతాయా అని ఉద్యోగులు, కాలేజీ కుర్రోళ్లు ఎదురుచూస్తుంటారు. ఒకేలాంటివి కాకుండా విభిన్నంగా ఉండేలా కొత్త కొత్త ప్రదేశాల కోసం నెట్టింట జల్లెడ పడుతుంటారు. ఆ కోవలో తాజాగా యూత్ ఫేవరిట్ డెస్టినేషన్‌గా మారింది అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు సమీపంలోని 'దేశీయ ఎకో రిసార్టు'. ఇది పూర్తిగా మట్టితో నిర్మించి, అలికిన గుమ్మాలతో కళకళలాడే చిన్ని చిన్ని నివాసాల సముదాయం. మన్యం వచ్చే పర్యాటకులకు అక్కడి సాధారణ జీవన విధానాన్ని రుచి చూపించాలనే ఆలోచనతో పురీకి చెందిన యుగబ్రత్‌కర్ దీనికి రూపమిచ్చారు. ఈ రిసార్టులోకి అడుగుపెట్టగానే మట్టివాసనలు మనకు పాత రోజులను గుర్తుచేస్తాయి. పిజ్జాలు, బర్గర్ల వంటి జంక్ ఫుడ్ కాకుండా సేంద్రియ కూరగాయలు, ధాన్యాలతో చేసిన ఆరోగ్యకరమైన భోజనం రారమ్మంటూ ఊరిస్తుంది. అంతేకాదు.. చుట్టుపక్కల గ్రామాల చిన్నారులకు పర్యాటకులతో వివిధ అంశాలపై శిక్షణ కూడా ఇప్పిస్తుంటారు. ఇలా విభిన్నమైన అనుభూతిని పంచుతూ హైదరాబాద్, పుణె తదితర నగరాల నుంచి యువతను ఆకర్షిస్తోంది.

– ఉదయ్, ముంచంగిపుట్టు గ్రామీణం

అంతులేని విషాదం

నాలుగు వేర్వేరు రహదారి ప్రమాదాల్లో ఐదుగురు యువకుల దుర్మరణం

ఓరుగల్లు రహదారులు పండగ వేళ రక్తంతో తడిచాయి. నాలుగు వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఇంటిల్లిపాదీ ఆనందోత్సవాలతో జరుపుకొనే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో ఈ విషాద ఘటనలు చోటు చేసుకోవడంతో బాధిత కుటుంబాలు గుండెలవిసేలా రోదిస్తున్నాయి.. ఎదిగిన బిడ్డలు అర్థాంతరంగా తనువు చాలించడం చూసి ఆయా గ్రామాలు దుఃఖసాగరంలో మునిగిపోయాయి.

రాయపర్తిలో ఇద్దరు స్నేహితులు



అన్వేష్



రాజు

రాయపర్తి, న్యూస్‌టుడే : సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆనందంగా పాల్గొన్న ఇద్దరు స్నేహితులు రహదారి ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన ఎర్ర లలిత-రాజు దంపతుల కుమారుడు రాజు(24), ఈదునూరి కళ్యాణి-యాకయ్య కుమారుడు అన్వేష్(18) గురువారం అర్ధరాత్రి వరకు బతుకమ్మ వేడుకల వద్ద సరదాగా గడిపారు. అనంతరం ద్విచక్ర వాహనంపై కిష్టాపురం క్రాస్ రోడ్డు జాతీయ రహదారి వైపు వస్తూ.. వాంకుడోతు తండా శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొన్నారు. రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన స్థలాన్ని ఎవరూ గుర్తించకపోవడంతో తీవ్ర గాయాలపాలైన అన్వేష్ సుమారు గంట పాటు మృత్యువుతో పోరాడి ప్రాణాలు విడిచాడు. వీరి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాడ్వాయిలో ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు



భూపతిరావు (పాతచిత్రం)

తాడ్వాయి, న్యూస్‌టుడే: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. వాజేడు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన యాలం భూపతిరావు(32) బొగత జలపాతం పేరియాడో రిసార్టు (హరిత హోటల్)లో సర్వీసు ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి 8 గంటలకు విధులు ముగించుకొని తాడ్వాయి మండలం కాటాపురం గ్రామంలో జరిగే సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేందుకు తన ద్విచక్రవాహనంపై వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున ఉత్సవం ముగిసిన తర్వాత తాడ్వాయి రిసార్టులో పనిచేసే అదే గ్రామానికి చెందిన ఆలేటి విజేందర్‌రెడ్డి, లక్ష్మీపురం అరవింద్, కన్నాయిగూడెం మండల కేంద్రానికి చెందిన తోలెం సందీప్‌లను వెంటబెట్టుకుని తన ద్విచక్రవాహనంపై బయలుదేరారు. బంజర ఎల్లాపూర్ సమీపంలో రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై పడిన చెట్టును గమనించక ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో భూపతిరావు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్సులో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు దయాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

నూతన వస్త్రాలను కొనేందుకు వెళ్తూ..



గుళ్లపెల్లి అఖిల్

జాన్‌పాక(గీసుకొండ), న్యూస్‌టుడే: దసరా పండగకు నూతన వస్త్రాలను కొనేందుకు వరంగల్‌కు వెళ్తూ డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటన వరంగల్ జిల్లా గీసుకొండ మండలం జాన్‌పాకలో శుక్రవారం జరిగింది. మృతుని బంధువులు, ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండలం ఉప్పరపెల్లి గ్రామానికి చెందిన గుళ్లపెల్లి కుమారస్వామి కుటుంబంతోసహా కొద్ది రోజుల కిందట హైదరాబాద్ వెళ్లి ఓ పరిశ్రమలో కాపలాదారుగా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు అఖిల్ (24) వరంగల్‌లో డిగ్రీ చదువుతూ మరో వైపు హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండగ కోసం కుమారస్వామి కుటుంబ సభ్యులంతా రెండ్రోజుల కిందట సొంతూరైన ఉప్పరపెల్లికి వచ్చారు. నూతల వస్త్రాలు తెచ్చుకునేందుకు అఖిల్ తన ద్విచక్రవాహనంపై శుక్రవారం మధ్యాహ్నం వరంగల్‌కు వెళ్తుండగా.. గీసుకొండ మండలం 16వ డివిజన్ పరిధి గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో తలకు బలమైన దెబ్బతగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. యువకుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని..



శ్రీనివాస్ (పాతచిత్రం)

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: దూపకుంట రోడ్డులో ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి గాయాలు కాగా ఓ యువకుడు మృతి చెందారు. శుక్రవారం శంభునిపేట నుంచి దూపకుంటకు వెళ్లే రోడ్డులో ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఖిలావరంగల్ మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి శ్రీనివాస్(19) ఆసుపత్రికి తరలిస్తుండగా మృత్యువాత పడ్డాడు. అదే గ్రామానికి చెందిన పృథ్వీ, ఖిలావరంగల్‌కు చెందిన అనిల్, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

మృతదేహంతో పోలీస్ స్టేషన్ ముందు నిరసన



రాజు (పాతచిత్రం)



మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ ముందు మృతదేహంతో..

రంగశాయిపేట, న్యూస్‌టుడే: పోలీసులు దూషించడంతో రక్తపోటు పెరిగి తమ ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామంటూ బాధిత కుటుంబ సభ్యులు శుక్రవారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ముందు మృతదేహంతో నిరసనకు దిగారు. శివనగర్ పాడి మల్లారెడ్డి నగర్‌కు చెందిన పసునూటి రాజు(62) అన్న పసునూటి సాంబయ్య మధ్య ఇంటి వివాదం కారణంగా ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. విచారణ జరిపిన పోలీసులు ఈ నెల 8న ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో ఆవేదనకు గురైన రాజు పోలీస్ స్టేషన్ బయటకు వచ్చాక బీపీ పెరిగి వాంతులు చేసుకున్నారు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ని నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకుపోయారు. అనంతరం ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేష్ దూషించిన కారణంగా తండ్రి రాజు మనస్తాపం చెందడంతో రక్తపోటు పెరిగి మృతి చెందారని కుమారుడు రాజేష్, భార్య లక్ష్మి ఆరోపించారు. ఏసీపీ నందిరాంనాయక్, సీఐ వెంకటరత్నం బాధితులతో మాట్లాడి తగిన న్యాయం చేస్తామంటూ ఆందోళన విరమింప చేశారు.

'విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన భారాస ప్రభుత్వం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, న్యూస్‌టుడే: గత పదేళ్ల భారాస పాలనలో కేసీఆర్ విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి రూ.125 కోట్లతో మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నవంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. కేసీఆర్ నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉండి సొంత నిర్ణయాలు తీసుకునే అర్హత లేక విద్యా వ్యవస్థ ఆగమవుతుంటే చూస్తూ ఉన్నట్లు తెలిపారు. దీంతో రాష్ట్రంలోని గురుకులాలు సర్వనాశనమైనట్లు వివరించారు. కేసీఆర్‌కు బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య అందించే ఆలోచన లేదని.. విద్య అందిస్తే వీళ్లు చాలా తెలివిగా మారి ప్రశ్నిస్తూ, తిరుగుబాటు చేస్తారని ఉద్దేశంతోనే విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ చేయడంతో పాటు.. డిగ్రీ కళాశాల మంజూరుకు ఉత్వర్వులు రాబోతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుర్రం ఫాతికుమార్ నాయకులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు పేర మోసం

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హోటల్ పెట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న చిరు వ్యాపారికి క్రెడిట్ కార్డు పేరిట ఓటీపీ నెంబరు చెప్పించుకొని రూ.46 వేలు డ్రా చేసుకొని మోసం చేసిన సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. కొప్పూర్‌కు చెందిన డాకూరి రమేష్ ములుకనూర్ అంబేడ్కర్ కూడలి వద్ద చిన్న హోటల్ పెట్టుకొన్నారు. వారం రోజుల క్రితం గిరిప్రసాద్ అనే వ్యక్తి హోటల్‌కు వచ్చి టీ తాగుతూ.. తాను ఎస్‌బీఐలో పని చేస్తున్నానని, క్రెడిట్ కార్డు తీసుకుంటే మీ వ్యాపారానికి ఉపయోగపడుతుందని నమ్మించాడు. బలవంతంగా క్రెడిట్ కార్డు దరఖాస్తు పత్రంపై సంతకాలు తీసుకొని కార్డు జారీ చేశాడు. మూడు రోజుల క్రితం చరవాణికి ఓ మహిళ ఫోన్ చేసి మీకు క్రెడిట్ కార్డు వచ్చిందా.. అంటూ వివరాలు అడిగారు. కార్డుపై ఉన్న నెంబరును అడిగి తెలుసుకున్నారు. మీ సెల్‌కు వచ్చిన ఓటీపీ నెంబరు చెప్పాలని అనడంతో నిరక్షరాస్యుడైన రమేష్ నెంబర్ చెప్పారు. శుక్రవారం క్రెడిట్ కార్డు రికవరీ ఏజెంట్లమంటూ ఇద్దరు వచ్చి, మీ కార్డు నుంచి రూ.46 వేలు లావాదేవీలు జరిగాయని, ఆ డబ్బు చెల్లించాలంటూ దౌర్జన్యం చేయడంతో స్థానిక ప్రజాసంఘాల నాయకులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వారిని ఠాణాకు తీసుకెళ్లి విచారించి వదిలేశారు. సైబర్ క్రైంకు సమాచారం ఇచ్చామని, వారి ఆదేశాల మేరకు తదుపరి విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు



ప్రసాదం తయారీని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత

రామన్నపేట, న్యూస్‌టుడే: దసరా పండగ, తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వచ్చే వేల మంది భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ వరంగల్ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ రామల సునీత ఉద్యోగులకు సూచించారు. భద్రకాళి ఆలయంలో భక్తుల ఇబ్బందులు పట్టించుకోవడం లేదనే విమర్శలు, ఫిర్యాదులు పెరగడంతో శుక్రవారం మధ్యాహ్నం జిల్లా సహాయ కమిషనర్ సునీత ఆలయంలో తనిఖీలు నిర్వహించారు. వృద్ధులు, చంటి పిల్లలతో వచ్చే భక్తుల కోసం ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయాలని, లడ్డూ, పులిహోర ప్రసాదం ఎక్కువగా తయారు చేయించాలని ఆదేశించారు. జిల్లా దేవాదాయ శాఖాధికారి వస్తే, ఈవో ఏమీ పట్టనట్లుగా ఛాంబర్‌కే పరిమితమవ్వడం ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

మహిషాసుర మర్దినిగా రుద్రేశ్వరి అలంకరణ



వాహన సేవలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్

హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు శుక్రవారం రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజల అనంతరం ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో రుద్రేశ్వరీదేవిని మహిషాసుర మర్దినిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సింహ వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేశారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. యాగశాలలో గత 9 రోజులుగా నిర్వహిస్తున్న హోమంలో మహా పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

ఉమ్మడి వరంగల్ అభివృద్ధికి కృషి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెంలో తన సమీప బంధువుల ఇంట్లో శుక్రవారం నిర్వహించిన శుభకార్యానికి ఆమె హాజరయ్యారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఎర్రబెల్లిగూడెం గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతానని హామీ ఇచ్చారు.

14న రెజ్లింగ్ ఎంపికలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా రెజ్లింగ్ ఎంపిక పోటీలు ఈనెల 14న నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి, కళాశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్‌ఐ) కార్యదర్శి అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ జేఎన్‌ఎస్ రెజ్లింగ్ హాల్‌లో అండర్-19 విభాగంలో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన వారు ఈనెల 15న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబరు 98492 10746లో సంప్రదించాలని తెలిపారు.